## క్లుప్తంగా

### ఉమ్రా యాత్రికులకు ఘన సత్కారం



ఉమ్రా యాత్రికులను సన్మానిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణం నుంచి ఉమ్రా యాత్రకు వెళ్లున్న లడ్డు మహమ్మద్ షఫీ, రేషం వాలె అమానుల్లా, ఫయాజ్‌ను హెల్పింగ్స్ హ్యాండ్స్ ఫ్రెండ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. వారిని శాలువలతో సన్మానించి ప్రభుత్వ ఖాజీ సైఫుల్లాచే దువా పఠించారు. ఉమ్రా తీర్థయాత్రతో పుణ్యఫలం లభిస్తుందన్నారు. హజ్ సమయంలో కాకుండా సాధారణ రోజుల్లో ముస్లింలు అధిక సంఖ్యలో ఉమ్రా యాత్ర చేయడాన్ని అభినందించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు క్వాలిటీ ఫుట్‌వేర్ మహమ్మద్ రఫీక్, ఫైరోజ్, ఇనాయత్ తదితరులు పాల్గొన్నారు.

### లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలి

కూడేరు: లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని మండలంలోని జయపురం, చోళసముద్రం గ్రామాలకు చెందిన రైతులు సోమవారం కూడేరులోని ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. వారు మాట్లాడుతూ సమస్యను కింది స్థాయి సిబ్బందికి చెబితే ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని వాపోయారు. లోఓల్టేజీ సమస్యను అధిగమించేలా చేస్తామని ఏఈ గౌస్ చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

### విద్యార్థులకు మోడల్ పేపర్ల పంపిణీ

కంబదూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 94 మంది విద్యార్థులకు సోమవారం యూటీఎఫ్ నేతలు మోడల్ పేపర్లను పంపిణీ చేశారు. ఎంఈఓ సాయికృష్ణ, హెచ్ఎం కృష్ణ నాయక్, యూటీఎఫ్ నాయకులు తిమ్మప్ప, నాగరాజు, మల్లికార్జున, రాజగోపాల్, మోహన్, కరీంసాబ్ తదితరులు పాల్గొన్నారు.

### విధుల్లోకి ఇంజినీరింగ్ అసిస్టెంట్

శెట్టూరు: మండలంలోని లక్ష్మంపల్లి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గౌనికుందన్ సోమవారం విధులకు హాజరయ్యారు. విధులపై నిర్లక్ష్యంగా ఉన్న ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను కలెక్టర్ నాగలక్ష్మి రెండు నెలల క్రితం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. జిల్లా అధికారులు సస్పెన్షన్ ఎత్తివేయడంతో సోమవారం ఆయన విధులకు హాజరయ్యారని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తెలిపారు.

### న్యాయం కోసం రైతుల ఆందోళన



తహసీల్దారు కార్యాలయంలో పురుగుల మందు డబ్బాతో రైతులు

విడపనకల్లు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. విడపనకల్లుకు చెందిన వన్నూరప్ప, లక్ష్మీనారాయణ, నారప్పకు చెందిన 40 సెంట్ల భూమిని దాయాది జయరాం ఆక్రమించుకున్నాడని బాధితులు వాపోయారు. అధికారుల అండదండలతోనే తమకు జయరాం అన్యాయం చేస్తున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు.అ న్యాయం చేయాలని పలుమార్లు తహసీల్దార్‌ను కోరినా పట్టించు కోవడం లేదని మండిపడ్డారు. ×న్యాయం చేస్తారా? లేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవాలా?* అంటూ వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగడానికి లక్ష్మీనారాయణ ప్రయత్నించాడు. వెంటనే అతడిని వారించి.. న్యాయం చేస్తామని ఆర్ఐ గోవిందరెడ్డి, సర్వేయర్ శ్రీనివాసులు తెలపడంతో రైతులు శాంతించారు.

### ఎణ్ణెరంగనాథేశ్వరుడి రథోత్సవం



బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడలో సోమవారం సాయంత్రం ఎణ్ణెరంగనాథేశ్వర స్వామి (యన్నప్ప తాత )రథోత్సవాన్ని వైభంగా నిర్వహించారు. 40 అడుగుల ఎత్తున్న రథంపై స్వామిని అధిష్ఠింపజేసి, గోవింద నామస్మరణతో భక్తులు లాగారు. ఈ సందర్భంగా యువకులకు కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు జెడ్పీటీసీ సభ్యుడు లోకేష్, ఎస్ఐ శివ బహుతులు ప్రదానం చేశారు.

# ప్రయాణం ఇక సాఫీగా..




పూర్తిగా దెబ్బతిన్న రహదారి




వంతెనపై నిర్మించిన రహదారి

- తీరిన వంతెన కష్టాలు
- ప్రయాణికుల హర్షం

బ్రహ్మసముద్రం: బ్రహ్మసముద్రం మండలం నుంచి రాయదుర్గానికి వెళ్లాలన్నా... గుమ్మఘట్ట మండలం నుంచి వేపులపర్తికి ప్రజలు రావాలన్నా.. వేదావతి నదిని దాటుకుని ప్రయాణం చేయాలి. దాదాపు కిలోమీటరు వేదావతి నదిపై హగరిలోనే ప్రయాణించాలి. 2022 జూన్, జూలై నెలల్లో ఎడతెరపి లేకుండా వర్షాలు పడటంతో పాటు ఎగువన ఉన్న కర్ణాటక ప్రాంతం నుంచి భారీగా నీరు రావడంతో భైరవానితిప్ప ప్రాజెక్టు పూర్తిగా నిండింది. నీటిపారుదలశాఖ అధికారులు అప్రమత్తమై ప్రాజెక్టు గేట్లు మొత్తం ఎత్తి దిగువన ఉన్న వేదావతి నదిలోకి నీటిని వదిలారు. వేదావతి ఉగ్రరూపం దాల్చడంతో రహదారిపై ఉన్న వంతెన పూర్తిగా దెబ్బతింది. దాదాపు ఆరు నెలలపాటు నీరు ప్రవహిస్తూ ఉండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. అటు కర్ణాటక.. ఇటు రాయదుర్గం ప్రాంతానికి వెళ్లాలంటే వేరే మార్గంలేక వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. మండలవాసుల వినతి మేరకు మంత్రి ఉషశ్రీచరణ్ స్పందించి వేదావతి నదిపై రహదారి మరమ్మతులు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. తాత్కాలిక మరమ్మతు చేపట్టడానికి దాదాపు రూ.30 లక్షలు మంజూరు చేయించారు. మంత్రి ఆదేశం మేరకు కాంట్రాక్టర్ త్వరతగతిన పనులు పూర్తి చేశారు. రెండు వారాల నుంచి ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుండటంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి ఉషశ్రీచరణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# దేవాలయ భూముల్లో మట్టి తరలింపు



దేవాలయ భూముల్లో మట్టిని అక్రమంగా తరలించిన దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని చాబాల గ్రామంలోని సుంకులమ్మ, పోతులయ్య దేవా లయాలకు చెందిన భూముల్లో కొందరు అక్రమార్కులు మట్టిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గత పది రోజులుగా రాత్రి సమయాల్లో పొలాల్లో పెద్దఎత్తున గోతులు పెట్టి మట్టిని ట్రాక్టర్లలో తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నా. గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులే ఈ తతంగాన్ని నడిపిస్తున్నట్లు బలంగా వినిపిస్తోంది. అక్రమంగా తరలించిన మట్టిని చాబాల నుంచి ఉరవకొండ వైపు వెళ్లే రహదారిలో ఇటీవల వేసిన వెంచర్‌కు వినియోగిస్తున్నట్లు సమాచారం. కొద్దిరోజులుగా మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల అనుమతి లేకుండా దేవాలయ భూముల్లో మట్టిని తరలించడం, విక్రయించడం చట్టరీత్యానేరం. మట్టి తరలించడంపై గ్రామస్తులు సోమవారం దేవదాయ ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, ఈఓ దేవదాస్‌కు ఫిర్యాదు చేశారు. ఈఓ మాట్లాడుతూ మట్టి తరలించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరామన్నారు.

# లయన్స్ క్లబ్ సభ్యులకు పురస్కారాలు




పురస్కారం అందుకుంటున్న ఉరవకొండ లయన్స్ క్లబ్ రీజినల్, డిస్ట్రిక్ట్ చైర్మన్లు

ఉరవకొండ: స్థానిక లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ కొమ్మసాని బాలచంద్ర, క్లబ్ అధ్యక్షుడు సప్తగిరి మల్లికార్జున, డిస్ట్రిక్ట్ చైర్మన్ టి.గణేష్‌బాబు, సభ్యుడు ఇంద్రావతి సరేంద్రకు ఉత్తమ పురస్కారాలు అందాయి. ఒంగోలులో ఈ నెల 18 నుంచి జరిగిన డిస్ట్రిక్ట్ లయన్స్ లీడర్‌షిప్ ఇన్‌స్టిట్యూట్ వారు నిర్వహించిన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి పేదలకు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నందుకు వారు లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుల చేతుల మీదుగా పురస్కారాలు పొందారు.

# సచివాలయ సేవలు మెరుగుపరచండి



సచివాలయ సేవలపై ఆరా తీస్తున్న డీఎల్‌డీఓ శంకర్

కళ్యాణదుర్గం: సచివాలయ సేవలను మెరుగుపరచాలని డీఎల్‌డీఓ శంకర్ సూచించారు. స్థానిక స్థానిక రెవెన్యూ కార్యాలయ సచివాలయాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు హాజరు, సచివాలయ సేవల అందజేత, సర్వీసు రిజిస్టర్ తదితర వాటిపై ఆరా తీశారు. అనంతరం ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అదేవిధంగా ఎస్‌డీజీ సర్వే, పీఎంజీవై కార్డుల పంపిణీ పురోగతిపై ఆరా తీశారు.

**గ్రామ సచివాలయం తనిఖీ**

బ్రహ్మసముద్రం: మండలంలోని ఎరడికెర గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ వెంకటనాయుడు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులతో పాటు ఉద్యోగులు, వలంటీర్ల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది బాధ్యతతో పనిచేసి, సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాల నిర్మాణ పనులపై ఆరా తీశారు పనులు నాణ్యతగా చేపట్టాలని ఆయన సూచించారు.

# వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి



మాట్లాడుతున్న రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి

రాయదుర్గం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, అభ్యర్థి సోదరుడు వెన్నపూస సంజీవరెడ్డి విజ్ఞప్తిచేశారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్, రెవెన్యూ, ఎంపీడీఓ, ట్రెజరీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, వార్డు సచివాలయాల్లో వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, పార్టీ ముఖ్య నాయకులు బోర్‌వెల్ నాగిరెడ్డి, పొరాళ్ల శివ, కౌన్సిలర్లతో కలసి వారు విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కరపత్రాలు అందచేసి ఓటును అభ్యర్థించారు. ఉపేంద్రారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో దేశాయి చంద్రశేఖర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, సత్తి పాల్గొన్నారు.

వజ్రకరూరు: ఎమ్మెల్సీగా వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. సోమ వారం సాయంత్రం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రమావత్‌దేవి, సర్పంచు మోనాలిసా, నియోజకవర్గ కోఆర్డినేటర్ రాజారెడ్డి, ఉపాధ్యక్షుడు ఉస్మాన్, మండల కార్యదర్శి నల్లబోతులరాజు, ఎస్టీ సెల్ కార్యదర్శి సామా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### పాలిసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం: పాలిసెట్–2023కు సంబంధించి ఈ నెల 16 నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల (బోరంపల్లి) ప్రిన్సిపాల్ వైఎస్ శ్రీధర్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. వివిధ కేంద్రాల్లో 10-05-2023న పరీక్ష ఉంటుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, పదో తరగతి పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పాలిసెట్‌కు అర్హులన్నారు. ఓసీ/బీసీ అభ్యర్థులు రూ.400, ఎస్సీ/ఎస్టీలు రూ.100 చెల్లించి మీ సేవ/ ఆన్‌లైన్, స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలోని హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ఏప్రిల్ 30 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గుమ్మఘట్ట: మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ నిర్మల్‌కుమార్ సూచించారు. బీటీపీ ప్రాజెక్టు కింద ఆయకట్టుకు సాగు నీటిని విడుదల చేయడంతో రైతులు పలు పంటలు సాగుచేశారు. మండలంలోని కలుగోడు, రంగచేడు గ్రామాల్లో ఏఓ నిర్మల్‌కుమార్ సోమవారం మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులకు సస్యరక్షణ చర్యల గురించి కూలంకుషంగా వివరించారు.

### వేరుశనగ కాయల చోరీ

కణేకల్లు: మండలంలోని తుంబిగనూరు గ్రామంలో రైతు హనుమంతరెడ్డి పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు వేరుశనగ కాయలను చోరీ చేశారు. హనుమంతరెడ్డి మూడెకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాడు. పంట కోత చేసి పొలంలోనే ఉంచాడు. కూలీలను పెట్టి వేరుశనగ కాయలు తీయించాల్సి ఉంది. ఆదివారం రాత్రి 10 గంటల వరకు పొలంలో కాపలా కాసిన రైతు ఆ తర్వాత ఇంటికెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు వేరుశనగ చెట్ల నుంచి కాయలను తీసి సంచుల్లో నింపుకెళ్లారు. సోమవారం ఉదయం గమనించిన ఆయన ఐదారు సంచుల వరకూ వేరుశనగకు చోరి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమారు రూ.23 వేల నష్టం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.

### పెట్రోల్ బంక్ తనిఖీ

కూడేరు: మండల కేంద్రంలోని భారత్ పెట్రోలియం పెట్రోల్ బంక్‌ను సోమవారం సాయంత్రం సీఎస్‌డీటీ లక్ష్మీదేవి తనిఖీ చేశారు. పెట్రోల్, డీజిల్ క్వాలిటీని పరిశీలించారు. కొలతల్లో తేడాలు లేకుండా చూడాలని ఆదేశించారు. వినియోగదారులకు మౌలిక వసతులను కల్పించాలన్నారు. అనంతరం ఆమె స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వీఆర్వో సేతుమాధవ్, సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు మద్దానేశ్వర స్వామి రథోత్సవం



పూజలందుకున్న మద్దానేశ్వర స్వామి



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళం సమీపంలో మద్దానేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు నిర్వహించనున్నట్లు గ్రూపు దేవాలయాల కార్యనిర్వాహణాధికారి నరసింహారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బసవరాజు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో ఉదయం 5 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 8 గంటల నుంచి వేదపండితులు సురేష్‌స్వామి, మాంతేష్ స్వామి, మంజునాథస్వామి, బసవరాజుస్వామి, కుమార్‌స్వామి తదితరులు గంగాపూజ, గణపతి హోమం, నవగ్రహ హోమం, రుద్ర హోమం, వాస్తు శాంతి హోమం, జయాధిహోమం, రథాంగహోమం, పూర్ణాహుతి హోమం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమాల్లో రాయదుర్గం, గుమ్మఘట్ట జెడ్పీటీసీ సభ్యులు హొన్నే మల్లికార్జున, మహేష్ , మాజీ ఎంపీపీ భారతి, జెడ్పీ మాజీ సభ్యుడు విజయ్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు అంపారెడ్డి , అన్నదాన కమిటీ చైర్మన్ జయణ్ణ, సభ్యులు మహానంది, ధరణేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా రథోత్సవం, పశువుల జాతర సందర్భంగా మార్చి 1 వరకూ నిర్వహించే అన్నదానం కోసం భక్తులు విరాళాలు ఇవ్వాలని ఆలయకమిటీ సభ్యులు కోరారు.

### బీసీలకు సముచిత స్థానం

కళ్యాణదుర్గం: స్థానిక సంస్థల కోటాలో అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా వాల్మీకులను ఎంపిక చేయడం హర్షణీయమని వాల్మీకి సేవా సమితి నియోజకవర్గ అధ్యక్షుడు ములకనూరు గోవిందు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతపురం జిల్లా లోకల్ కోటాలో మంగమ్మకు, కర్నూలులో డాక్టర్ మధుసూదన్‌కు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించడంతో వాల్మీకులకు సముచిత స్థానం కల్పించినట్లైందన్నారు. వాల్మీకులు సీఎంకు అండగా ఉంటామన్నారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కల్కి ఆలయ ఏడో వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ భగవాన్ చిత్రపటానికి పాదుకాభిషేకం చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రమద దాసాజీ, ఇందిరా దాసాజీ హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు రమేష్, దేవరాజ్, ప్రసాద్, చంద్రశేఖర్, రాధాకృష్ణ, వినోద్, రాఘవేంద్ర, రవి, లత, మణి, అంజి, శరత్, తిప్పేస్వామి తదిరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ట్యాబ్‌లు ఉపయోగించాలి



విద్యార్థుల ట్యాబ్‌లను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీధర్

శెట్టూరు: ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌ను విద్యార్థులు తప్పనిసరిగా ఉపయోగించాలని ఎంఈఓ శ్రీధర్ సూచించారు. సోమవారం మండలంలోని చిన్నంపల్లి ఉన్నత పాఠశాల, మంగంపల్లి, గోకులం ప్రాథమిక పాఠశాలలను పేరెంట్స్ కమిటీ చైర్మన్ రవిశంకర్‌తో కలసి ఆయన పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు నాణ్యమైన, సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో జగనన్న గోరు ముద్ద పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ వారి సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సాధన పుస్తకాలను, ఉపాధ్యా దినచర్య పుస్తకాలను పరిశీలించారు.

# పౌష్టికాహారంతో రక్తహీనత దూరం





లింగదహాల్, మాళాపురంలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

బొమ్మనహాళ్: పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత సమస్య రాదని పీహెచ్‌సీ వైద్యాధికారిణీ డాక్టర్ గీతాభార్గవి సూచించారు. సోమవారం మండలంలోని లింగదహాళ్ గ్రామంలోని పాఠశాలలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, చికిత్సలు అందించారు. అనంతరం సంపూర్ణ ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు రమణ, ఎర్రమ్మ, అలివేలు ఉపాధ్యాయులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విడపనకల్లు: మండలంలోని మాళాపురంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలో సోమవారం విడపనకల్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయినులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైభవంగా వీరభద్రస్వామి రథోత్సవం



వజ్రకరూరు: వీరభద్రస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు



రాయదుర్గం: భక్తుల మధ్య జంబన్నతాత రథోత్సవం

వజ్రకరూరు: మండలంలోని తట్రకల్లు గ్రామంలో సోమవారం సాయంత్రం భద్రకాళిసమేత వీరభద్రస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్రాభిషేకం చేపట్టారు. మధ్యాహ్నం భద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం సర్పంచు ధనలక్ష్మి, నాయకులతో కలసి ఎమ్మెల్సీ రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి.. వేలాది మంది భక్తుల నడు మ రథాన్ని ముందుకు లాగారు. నమో వీరభద్ర, హరహర మహాదేవా అంటూ భక్తులు నామస్మర ణ చేశారు. బసవన్న దేవాలయం వరకూ రథాన్ని లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. వేలాదిగా హాజరైన భక్తులు రథంపై పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గంజికుంట సర్పంచు జయేంద్ర రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమణాయాదవ్, వైఎస్సార్‌సీపీనాయకులు శశాంక్‌రెడ్డి, శివలింగ, వీర భ ద్రగౌడ్, జయరమేష్, శ్రీనివాసులు, అర్చకులు రఘుస్వామి, మల్లిఖార్జునస్వామి, ఎంపీటీసీ రామక్రిష్ణ తది త రులు పాల్గొన్నారు.ఇన్‌చార్జ్ ఎస్ఐ వెంకటస్వామి, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



వజ్రకరూరు: వీరభద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

**జంబన్నతాత రథోత్సవం**

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని పులకుర్తిలో జంబన్నతాత రథోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. రథం ముందు యువకులు చేసిన నంది కోలు నాట్యం ఆకట్టుకుంది. చిన్నారులు ప్రదర్శించిన చెక్కభజన, కోలాటం, భజన, భక్తి గేయాలు అలరించాయి. అడుగడుగునా శివనామస్మరణ కీర్తనలు మార్మోగాయి. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరై స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆదిగురువుగా ప్రఖ్యాత గాంచిన జంబన్నతాత వందేళ్ల క్రితం జీవ సమాధి అయ్యారని గ్రామస్తులు వివరించారు. మరో రెండు రోజుల పాటు గ్రామంలో ఈ ఉత్సవాలు కొనసాగుతాయన్నారు.

**కనుల పండువగా వసంతోత్సవం**

వజ్రకరూరు: మండలంలోని జరుట్లరాంపురంలో రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం వసంతోత్సవ కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. స్థానికులతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. కా ర్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రామాంజనేయులుయాదవ్, సర్పంచు తిరుపాల్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమణాయాదవ్, . ధర్మకర్తల మండలి సభ్యులు సుబ్బారెడ్డి, చలపతి, రమేష్, రాములమ్మ, లక్ష్మిదేవి, ఈఓ దేవదాసు, అసిస్టెంట్లు లా లే ష్, లోకేష్ అర్చకులు నాగరాజుస్వామి, రాజేంద్రప్రసాద్ స్వామి, మంజునాథస్వామి తదితరులు పాల్గొన్నారు.

### గృహసారథుల సమావేశం విజయవంతం చేయండి

ఉరవకొండ: స్థానిక బళ్లారి బైపాస్ వద్ద ఉన్న దేవాంగ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించే ఉరవకొండ పట్టణ, మండల గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల, గ్రామ వలంటీర్ల సమావేశాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ పట్టణ, రూరల్ కన్వీనర్లు బ్యాంకు ఓబులేసు, వెలిగొండ నరసింహులు కోరారు. సోమవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు ఉరవకొండ పట్టణ గృహసారథుల సమావేశం, మధ్యాహ్నం 1 గంటలకు రూరల్ గృహసారథుల సమావేశం నిర్వహిస్తారన్నారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఆయన తనయుడు ప్రణయ్‌రెడ్డి హాజరవుతారన్నారు.